చెంతనే నీరు.. అయినా వాడుకోలేరు..

- టీడీపీ పాలకుల అన్యాయం.. నేటికీ దళిత రైతులను వెంటాడుతున్న శాపం
- చెరువుకు, పొలాలకు మధ్య ఎస్ఎస్ కెనాల్ ఏర్పాటు
- 87 ఎకరాల ఆయకట్టు భూములన్నీ బీడుగానే..
- ప్రత్యామ్నాయ మార్గం చూపాలంటూ ఎమ్మెల్యేకు మొర


జలకళ సంతరించుకున్న సింగరాచార్యుల కండ్రిగ చెరువు


బీడుగా దర్శనమిస్తున్న భూములు


చెరువుకు-పొలాలకు మధ్యలో తవ్విన ఎస్ఎస్ కెనాల్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో గత డిసెంబర్ నెలలో మాండూస్ తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. అదేవిధంగా కాలువలు, గుంతలు, బావులు నిండిపోవడం వల్ల భూగర్భ జలాలు అనూహ్యంగా పెరిగాయి. మండలంలో ఏ గ్రామంలో చూసినా రైతులు, రైతు కూలీలు మొత్తం రబీసాగులో బిజీబిజీగా ఉన్నారు. గతంలో సాగు చేయని భూములు సైతం నేడు సాగులోకి వచ్చాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి అన్ని చెరువులు నిండడంతో ప్రతి రైతు కళ్లలో ఆనందం పరవళ్లు తొక్కుతున్నాయి. అయితే మండలంలోని మారుమూల గ్రామ పంచాయతీ వెలంపాడు దళితకాలనీ రైతులు మాత్రం ఈ ఏడాది కూడా తమ పరిస్థితి అంధకారమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాత్రికి రాత్రే వెలంపాడు చెరువు దగ్గర కెనాల్‌ను తవ్వేశారు. దీంతో గత ఎనిమిది ఏళ్లుగా తాము పంటలను సాగు చేయలేకపోతున్నామని గత నెల 14న వెలంపాడు గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వారు తమ సమస్యను మొర పెట్టుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గం చూస్తానంటూ ఆయన హామీ ఇవ్వడంతో కాసింత ఆశలు చిగురించాయి.

నీరున్నా.. సాగు చేయలేని వైనం..

మండలంలోని వెలంపాడు పంచాయతీ పరిధిలోని దళితకాలనీలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. అనాదికాలం నుంచి కూడా కేవలం దళితకాలనీకి మాత్రమే సింగరాచార్యుల కండ్రిగ చెరువు కింద 87 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇక్కడి రైతులు చెరువు కింద ఉన్న పొలాన్ని సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదే మార్గంలో అప్పటి ప్రభుత్వం సోమశిల–స్వర్ణముఖి కాలువ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో అధికారులు నిర్వహించిన సర్వేలో సింగరాచార్యుల చెరువు, పొలాలకు మధ్య ఎస్ఎస్ కెనాల్ కాలువను తవ్వడానికి నిర్ణయించారు. అయితే అప్పట్లో రైతులు గుర్తించి కెనాల్ దగ్గర ధర్నాలు చేసి పనులను అడ్డుకున్నారు. అధికారులు చెరువు నుంచి పొలాల్లోకి సాగునీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన తూమును, పంట కాలువను పూడ్చకుండా విడిచిపెట్టి మిగతా భాగంలో కాలువను తవ్వారు. దీంతో రైతులు అప్పటి నుంచి చెరువు నీటితో తమ పొలాలను సాగుచేసుకుంటూ వచ్చారు.

రాత్రికి రాత్రి తవ్వేశారు..

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. కెనాల్ కాంట్రాక్టర్ మారిపోయాడు.. రాత్రికి రాత్రే చెరువు దగ్గర కెనాల్‌ను తవ్వేశారు. దీంతో గత ఎనిమిది ఏళ్ల నుంచి ఎటువంటి పంటలు సాగుచేయలేక బీడు భూములుగా వదిలేశారు. గతంలో వ్యవసాయం సాగు చేసుకుంటున్న దళిత రైతులు నేడు రైతు కూలీలుగా మారిపోయారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు దగ్గరకు వెళ్లి మొర పెట్టుకున్నా వారిని పట్టించుకోలేదు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడడంతో తమ చెరువు కూడా జలకళ సంతరించుకుందని, అయితే ఆ నీటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉందని కన్నీరు పెట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తూము నుంచి పొలాల్లోకి పంట కాలువ ఏర్పాటు చేసి పంటల సాగుకు తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఏటా వలసలు వెళ్తున్నాం..

గతంలో వర్షాలు లేక సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. దీంతో బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లి మళ్లీ వచ్చేవాళ్లం. గత రెండేళ్ల నుంచి పుష్కలంగా వర్షాలు పడి చెరువు నిండినా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సాగుచేసుకోలేని దుస్థితి నెలకొంది.

–వెంకటయ్య, స్థానిక రైతు

ప్రభుత్వం దృష్టి సారించాలి..

అధికారులు, పాలకులు ఒక్కసారి వచ్చి ఇక్కడ పరిస్థితి పరిశీలించాలి. తాము పడుతున్న అవస్థలు ప్రత్యక్షంగా తెలుస్తాయి. అధికారులు పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి.

– బాలకృష్ణయ్య, స్థానిక రైతు

క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు


దోమల నివారణకు మలాథీన్‌ను స్ప్రే చేయిస్తున్న సర్పంచ్ రమణమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో ఆదివారం సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. గ్రామ వీధులు, దళితవాడలో డ్రైనేజీ కాలువల్లోని మురుగును కూలీలతో తొలగించారు. అదేవిధంగా వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరుహెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధికాకుండా మలాథీన్ స్ప్రే చేయించి పరిసరాలను శుభ్రం చేశారు. దీనిపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

శరవేగంగా నాడు-నేడు పనులు


నిర్మాణంలో ఉన్న గదులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నాడు–నేడు పథకంలో గదుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాలుగు గదుల్లో ఐదు తరగతులను నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు 207 మంది విద్యార్థులు చదువుకుంటున్నాయి. వీరు చాలీచాలని గదుల్లో చదువులు సాగిస్తున్నారు. ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద ఆరు గదుల నిర్మాణం కోసం రూ.50 లక్షలను మంజూరు చేసింది. దీంతో ఈ గదుల నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే గదుల కొరత ఉండదని విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


గురుదక్షిణామూర్తి సన్నిధిలో కొట్టు విశాల్


రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, విజిలెన్స్ అధికారి సునీతకు ప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, విజిలెన్స్ అధికారి సునీత, ఆర్‌టీఐ కమిషనర్ కట్ట జనార్దన్ రావు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుమారుడు కొట్టు విశాల్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1,685 టన్నుల యూరియా పంపిణీ

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 1,685 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 39,820 ఎకరాల్లో వరి, వేరుశనగ, మినుము సాగుచేసినట్లు చెప్పారు. 56 రైతు భరోసా కేంద్రాల ద్వారా 1,685 టన్నుల యూరియా, 170 టన్నుల కాంప్లెక్సు ఎరువులు, 137 టన్నుల డీఏపీ, 10 టన్నుల ఎంఓపీ రైతులకు అందించినట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు డీలర్ల ద్వారా వివిధ రకాల ఎరువులు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి రైతుకు ఎరువులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

బాలుడికి రక్తదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్ చికిత్స పొందుతున్న ఓ బాలునికి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన 8 ఏళ్ల బాలుడు తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ బాలునికి గుండె శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. అతనికి అరుదైన ఓ నెగిటివ్ రక్తం కావడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పట్టణానికి చెందిన యువతరం సేవాసమితి వారిని సంప్రదించారు. వారు షేక్ ఫక్రుద్దీన్‌కు తెలుపగా వెంటనే తిరుపతికి వెళ్లి రక్తదానం చేశాడు.

నేడు వైఎస్సార్‌కు నివాళులు


ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

పిచ్చాటూరు: ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి సోమవారం నాటికి 4 ఏళ్ల పూర్తి అయిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలను గజమాలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

విశ్రాంత విమానాశ్రయ ఉద్యోగి ఇంట్లో చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అంజూయాదవ్

శ్రీకాళహస్తి: విశ్రాంత విమానాశ్రయ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. బీపీ అగ్రహారానికి చెందిన విశ్రాంత విమానాశ్రయ ఉద్యోగి ప్రసాద్ మూడు రోజుల క్రితం కుటుంబ సమేతంగా బయట ప్రాంతాలకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని స్థానికులు గమనించి ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన ఇంటికి చేరుకుని చూడగా చోరీ జరిగినట్టు గుర్తించారు. 21 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1వ పట్టణ సీఐ అంజూయాదవ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత డైనమోస్ టీం


విజేత జట్టుతో బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ టోర్నమెంట్ రసవత్తరంగా జరిగింది. ఏటా సంక్రాంతికి ముందు ఇక్కడ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో మొత్తం 12జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో రేణిగుంట లయన్స్, తిరుపతి డైనమోస్ జట్లు తలపడగా, తిరుపతి డైనమోస్ జట్టు విజేతగా, రేణిగుంట లయన్స్ రన్నర్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి విజేతలకు షీల్డులను, నగదు బహుమతిని అందజేశారు. క్రీడలు మనిషిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరిపక్వతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేశం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజా, రమేష్‌రాయల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సమర్పించండి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీ పల్లికొండేశ్వరాలయ పాలక మండలికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆలయ ఈఓ రామచంద్రా రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభ్యర్థులు ఈ నెల 11, 12, 17 తేదీల్లో తమ ఆస్తి, నివాస ధ్రువీకరణ పత్రాలను సురుటపల్లిలోని ఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


బీఎన్ కండ్రిగలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 65 మంది రోగులకు డాక్టర్లు వేదతేజ, రఘు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులకు ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. వీరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంగా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని మేనేజరు రఘునాథ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పీఆర్‌ఓ పాల్గొన్నారు.

ఉపాధిహామీపై సామాజిక తనిఖీలు


గ్రామసభలో పాల్గొన్న సామాజిక తనిఖీల బృందం

ఏర్పేడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీల గ్రామసభలు జరిగాయి. రావిళ్లవారికండ్రిగ, నచ్చనేరి, పంగూరు, కొత్త వీరాపురం, సరస్వతికండ్రిగ, కోబాక గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద జరిగిన వివిధ రకాల పనులను సామాజిక తనిఖీల బృందం పరిశీలించారు. తనిఖీల్లో తేలిన అవినీతిని గ్రామసభలో ఆయా పంచాయతీల డీఆర్పీలు చదవి వినిపించారు. ఈ నెల 13న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే సామాజిక తనిఖీల బహిరంగ సభలో అవినీతి వివరాలను వెల్లడించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాధాకృష్ణ, బుజ్జమ్మ, ఏపీఓ దేవరి, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి


బహుమతులు అందజేస్తున్న సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: గిరిజనులు ఆర్థికంగా ఎదగాలని తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత సిపాయి సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముందస్తుగా ముగ్గుల పోటీలు జరిగాయి. ఆయన మాట్లాడుతూముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు మిక్సీ, రైస్ కుక్కర్, గ్యాస్ స్టవ్, స్టీల్ క్యారియర్లను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, న్యాయవాదులు తిరుమలరెడ్డి, మురళి, పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు చేస్తున్న ఎంజీఎం వైద్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని బృందమ్మ కాలనీలో ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం వైద్యులు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్, వైద్యులు వివేక్ చైతన్య, తేజస్విని, దినేష్‌కుమార్, అభిషేక్, ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో శ్రీశైలం ఈఓ


లవన్న, ప్రతాప్ స్వామీజీకి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

తిరుపతి కల్చరల్: శ్రీశైలం ఆలయం ఈవో లవన్న, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆదివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ అర్చకులతో ఆశీర్వాదం అందజేశారు. అనంతరం వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయాలకు చిహ్నాలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు

రేణిగుంట: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలని తిరుపతి జిల్లా బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ గవర్నింగ్ బాడీ మెంబర్ శేషగిరిరావు అన్నారు. బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు రేణిగుంట బాలికోన్నత పాఠశాల మైదానంలో ముగ్గుల పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు భావితరాలకు అందించేందుకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు హనుమంతురావు, స్వాతి, రమేష్, రామ్మోహన్, రెడ్డిప్రకాష్, వెన్నెలకంటి కృష్ణమూర్తి, పంకజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్ల వితరణ

పిచ్చాటూరు: నాగలాపురం ఆదిఆంధ్రవాడలోని మహిళలకు మహిళా విమోచన మండలి అధ్యక్షురాలు విజయకుమారి ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ సంస్థ తరపున ఏటా ఇలాంటి సేవా కార్యాక్రమాలు చేపడుతున్నట్లు చేపడుతుందన్నారు. అనంతరం 104 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా విమోచన మండలి డైరెక్టర్ మనోజ్‌కుమార్, వెళ్లూరు సర్పంచ్ పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేస్తున్న పందులు


పందులు ధ్వంసం చేసిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని వరిపంటను పందులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని రైతులు వేసిన వరిపంటను పెంపుడు పందులు ధ్వంసం చేస్తున్నాయి. పందులను పెంచుతున్న వారు పందులను పొలాల్లోకి తోలుతున్నారని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. పందులను పంట వద్దకు తీసుకురావద్దని పలుమార్లు పందుల పెంపకం దారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ఈ విషయన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్తామని రైతులు తెలిపారు. పందుల నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పుడమికి హరితహారం



వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లి ప్రాంతంలో ఎన్ను దశలో ఉన్న వరి పంట, పాండూరులో ..

- పుష్కలంగా వరి పంట సాగు
- రబీ సీజన్‌లో భారీగా పంటల సాగు..
- సత్యవేడు డివిజన్ పరిధిలో 5,509 హెక్టార్లలో పంటలు

వరదయ్యపాళెం: ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడడంతో రైతులు భారీగా పంటల సాగు చేపట్టారు. దీంతో నేలతల్లి పచ్చని పందిరి పరుచుకున్నట్లు కనిపిస్తోందిది. మండలంలో రైతులు వరి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో సత్యవేడు నియోజకవర్గంలో పొలాలన్నీ పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంటను విస్తారంగా సాగు చేసేస్తున్నారు. ఆ దిశగా సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో ఇప్పటివరకు 5,509 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి ఎన్ను దశలో ఉంది. మరోవైపు గత నెల డిసెండరులో మాండూస్ తుపాన్ కారణంగా భారీగా వర్షాలు పడడంతో చెరువులు, వాగులు, వంకలు నిండుగా ఉన్నాయి. దీంతో సాగునీటి ఇబ్బందులు లేవు. అంతేగాకుండా ప్రస్తుత ప్రభుత్వం గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో సాగుకు అవసరమైన పనిముట్లు, యంత్ర సామగ్రి, ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉండడంతో రైతులకు పంటల సాగు మరింత సులభంగా మారింది. పంటల సాగు సమయానికి పెట్టుబడులకు సంబంధించి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుండడంతో రైతులు పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ సాయం రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.